క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

డుంబ్రిగుడ: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించే ఆరోగ్య పోషణ కార్యక్రమానికి అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేస్తున్నారని సీడీపీవో నీలిమ తెలిపారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

కొయ్యూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నామని ఎంపీడీవో మేరీరోజ్ మంగళవారం తెలిపారు. దీనిపై ప్రజాప్రతినిధులకు ముందస్తుగానే సమాచారం ఇచ్చామన్నారు. అధికారులు పూర్తి వివరాలతో హాజరు కావాలన్నారు.

నుర్మతిలో రాజ్‌మా విత్తనాల పంపిణీ రేపు

జి.మాడుగుల: నుర్మతి సచివాలయం పరిధి గ్రామాల గిరిజన రైతులకు గురువారం రైతు సేవా కేంద్రం వద్ద 90 శాతం సబ్సిడీపై రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేస్తామని మండల వ్యవసాయాధికారి లకే రవీంద్రబాబు పాత్రుడు, ఎంపీఈవో ప్రశాంత్ కుమార్ తెలిపారు. గ్రామ పంచాయతీలో రైతులు తమ భూపట్టా, ఆధార్ కార్డు జెరాక్స్, ఫోన్ నంబర్ తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. జీవ ఎరువులు 50 శాతం సబ్సిడీపై అందిస్తామన్నారు. పీఎం కిసాన్, ఈ -పంట, ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు.

దోమతెరలు వినియోగించాలి



దోమతెరలు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి ఉదయ్‌కుమార్‌రెడ్డి

చింతూరు: దోమల నియంత్రణకు దోమతెరలు ఎంతగానో దోహదపడతాయని, అందరూ వీటిని తప్పనిసరిగా వినియోగించాలని తులసిపాక పీహెచ్‌సీ వైద్యాధికారి ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గొల్లగూడెంలో 39 కుటుంబాలకు, ఎర్రగొండపాకలలో 41 కుటుంబాలకు వైద్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం దోమతెరలు పంపిణీ చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ దోమతెరలను ఇతర అవసరాలకు వినియోగించవద్దన్నారు. ఇళ్ల ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిలువ లేకుండా చూడాలని సూచించారు.

చింతపల్లిలో పంట నష్టం పరిశీలన



వరి పంట నష్టాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ పుష్పలత

చింతపల్లి: స్థానిక పంచాయతీ పరిధిలో వరి పంట నష్టాన్ని సర్పంచ్ దురియా పుష్పలత మంగళవారం పరిశీలించారు. మల్లవరం, గడపరాయి, కందులగాది, చిలకలమామిడి తదితర గ్రామాలలో సచివాలయం-2 అగ్రికల్చరల్ అసిస్టెంట్ చంద్రకళ, వీఆర్వో చిరంజీవిలతో కలిసి ఆమె ముంపు ప్రదేశాలకు వెళ్లి పరిశీలించారు. ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్లి ముంపునకు గురైనా పొలాలకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ముత్తా శ్రీను, గడపరాయి వార్డు మెంబర్ లింగబాబు, కేశవరావు, సుబ్బారావు, మత్యరాజు పాల్గొన్నారు.

సర్పంచ్ చొరవతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



కితలంగిలో ఏర్పాటు చేసిన నూతన ట్రాన్స్‌ఫార్మర్

డుంబ్రిగుడ: కితలంగి పంచాయతీలో సర్పంచ్ సుబ్బారావు చొరవతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. భారీ వర్షాలకు ఇది మరమ్మతులకు గురికావడంతో రెండు రోజులుగా గ్రామానికి విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో తక్షణమే సర్పంచ్ స్పందించి ఆ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. లైన్‌మన్లు ధర్మ, ప్రసాద్, నిరంజన్‌కు యూత్ సభ్యులు, గ్రామపెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. వార్డు మెంబర్ త్రినాథ్ రావు, యూత్ సభ్యులు ధనుర్జయ్, రాంబాబు, అర్జున్ పాల్గొన్నారు.

వర్ష బీభత్సం.. తీరని నష్టం



జి.మాడుగుల మండలం వంచుర్బలో కొట్టుకుపోయిన వరి పంటను చూపిస్తున్న గిరిజన రైతు



కొట్టుకుపోయిన అగ్రహారం బ్రిడ్జి

- ఆర్‌అండ్‌బీ రోడ్లు, వంతెనలకు తీవ్ర నష్టం
- అంతర్రాష్ట్రాలకు స్తంభించిన రవాణా వ్యవస్థ
- ఖరీఫ్ వరి పంట మునక



సిలేరు రోడ్డులోని చిత్రకొండ జంక్షన్ సమీపంలో రోడ్డుపై మట్టి, కొండచరియలు

సాక్షి, పాడేరు: వర్ష బీభత్సం జిల్లాకు తీరని నష్టాన్ని మిగిల్చింది. వరదలో వేలాది ఎకరాల ఖరీఫ్ వరి పంట మునిగిపోయింది. లోతట్టు ప్రాంతాల్లో పంట కొట్టుకుపోయింది. జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిసినప్పటికీ చింతపల్లి, కొయ్యూరు, జి.కె.వీధి మండలాల్లో నష్టం తీవ్రంగా ఉంది. ఆర్‌అండ్‌బీ రోడ్లతో పాటు వంతెనలు, కల్వర్టులకు నష్టం అధికంగా ఉంది. చింతపల్లి నుంచి సిలేరు పోయే అంతర్రాష్ట్ర రోడ్డులో పలు చోట్ల కల్వర్టులు, బ్రిడ్జిలు కొట్టుకుపోవడంతో పాటు రోడ్డుపై కొండచరియలు దూసుకురావడంతో మూడు రోజుల నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. అంతర్రాష్ట్రాలకు రవాణా సంబంధాలు స్తంభించాయి. ఈ రోడ్లలో రవాణా వ్యవస్థ పునరుద్ధరణకు ఆర్‌అండ్‌బీ శాఖ పనులను చేపట్టింది. జోలాపుట్టు డ్యామ్ నుంచి నీరు వదిలి పెట్టడంతో సమీపంలోని మినీ వంతెన కొట్టుకుపోయింది. దాంతో ఒడిశాలోని జోలాపుట్టు, ఆంధ్రాలోని జోలాపుట్టు ప్రాంతాలకు రవాణా స్తంభించింది. జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షాలతో ఖరీఫ్ వరిపంటకు నష్టం వాటిల్లిందని అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. గిరిజనుల మట్టి ఇళ్లు కూలిపోయాయి. జి.కె.వీధి మండలం చాట్రపల్లి గ్రామంలో కొండచరియలు గ్రామంలోకి దూసుకువచ్చిన ఘోర ప్రమాదంలో కొర్రా కుమారి మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ గ్రామంలో నాలుగు గృహాలు ధ్వంసమయ్యాయి.



ఐస్‌గడ్డ జలపాతం సమీపంలో రోడ్డుపై విరిగిపడిన కొండచరియలు



కోతకు గురైన వలసగెడ్డ బ్రిడ్జి

జిల్లాలో నష్టాల వివరాలు

- వర్షాలు ప్రభావం ఉన్న మండలాలు-18
- వర్షాలతో ఇబ్బందులు పడిన జనాభా-3993
- వరద ముంపుకు గురైన ఖరీఫ్ వరి పంట-2084.02హెక్టార్లు
- హార్టికల్చర్ పంట-2 హెక్టార్లు
- ఇళ్లులు నష్టాలు -89
- పశువుల నష్టం-11
- గొర్రెలు, మేకలు నష్టం-11
- కోళ్లు నష్టం-50
- మైనర్ ఇరిగేషన్ నష్టాలు రూ.22.31లక్షలు
- వాటర్ ట్యాంకులు ధ్వంసం-6
- కాజ్‌వేలు, కల్వర్టులు ధ్వంసం, ఇతర నష్టాలు-45
- బ్రిడ్జిలు ధ్వంసం, ఇతర నష్టాలు-22
- రోడ్లు ధ్వంసం-13
- రోడ్లు కోత-3

ప్రభుత్వానికి నివేదిక

వర్షాలతో జిల్లాలో ఏర్పడిన నష్టాలపై కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ సమగ్ర వివరాలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి పంపారు. ప్రాథమిక సమాచారం సేకరించిన అధికారులు వర్షాలు తగ్గడంతో గ్రామ స్థాయిలో నష్టాల అంచనాకు తగిన చర్యలు చేపడుతున్నారు.

వరద సమాచారం తెలిసినా
పట్టించుకోని కూటమి ప్రభుత్వం

- బాధితులకు సత్వర సాయంలోను నిర్లక్ష్యమే
- న్యాయం లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ పోరాటం
- ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు



సాక్షి,పాడేరు: రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల సమాచారం ముందే తెలిసినా ప్రజల ఆస్తులు, ప్రాణాలను కాపాడడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ విజయవాడ ప్రాంతంలో వరద బీభత్సంతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా విజయవాడలోని నివాసాలు మునిగిపోయి ప్రజల ఆర్తనాదాలు కన్నీరు పెట్టించాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వరదతో ప్రజలు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని కాలం గడిపారు. సుమారు 50 మంది వరకు ప్రజల ప్రాణాలకు నష్టం కలగడం అత్యంత బాధకరమన్నారు. ఇంతమంది ప్రజలు వరదలతో చనిపోవడానికి కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. మృతుల కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. ప్రజల ప్రాణాలతో కూటమి ప్రభుత్వం ఆటలాడుకుందన్నారు. ఎంతో అనుభవం ఉందని చెప్పుకునే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భారీ వర్షాలు, వరదలపై సమాచారం ఉన్న ప్రజల ప్రాణాలను గాలిలోకి వదిలేసేలా పరిపాలన సాగించడం దారుణమని మండిపడ్డారు. విజయవాడ వంటి మహానగరాన్ని బుడమేరు వాగు ముంచెత్తిన సమయంలోను ప్రభుత్వం సకాలంలో స్పందించలేదన్నారు.

నగరం పూర్తిగా మునిగిపోయిన తర్వాత ముఖ్యమంత్రితో పాటు ప్రభుత్వ పెద్దలు తాపీగా స్పందించడం దుర్మార్గమన్నారు. బుడమేరు వరద ఉధృతిలో విజయవాడ మహానగరం మునిగిపోవడం, ప్రజలు కార్లు, బైక్లు వంటి వాహనాలు కొట్టుకుపోయిన సంఘటనలన్నీ ప్రభుత్వ తప్పిదాలను రుజువు చేస్తుందన్నారు. ఈ ఘోర సంఘటన జరిగి 9 రోజులు కావస్తున్నా, సహాయ చర్యల్లో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇప్పటికి అనేక వీధులు, నివాసాలు వరద నీటి ముంపులోనే ఉన్నాయని వాపోయారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అనేక తుపాన్లు, వరదలను సమర్థవంతంగా ఎదుర్కొని, అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో సహాయక కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరిగాయన్నారు. ప్రజల ఆస్తులతో పాటు ప్రాణనష్టం లేకుండా సమర్థవంతమైన పరిపాలన అందించారని గుర్తు చేశారు. వలంటీర్ల వ్యవస్థ ఉంటే వరద బాధితులకు సత్వర సహాయ కార్యక్రమాలు జరిగి ఉండేవని, దాన్ని ప్రజలకు కూటమి ప్రభుత్వం దూరం చేసిందన్నారు. నిర్లక్ష్య ధోరణీ వీడి వరద బాధితులకు సత్వర న్యాయం చేసి అన్ని విధాలా ఆదుకునేంత వరకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పోరాటాలు చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

సిద్ధి వినాయకుడికి పూజలు



పెదబయలులో వినాయక నిమజ్జన ఊరేగింపు సందడి



సీతగుంటలో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు

పెదబయలు: వినాయక నవరాత్రులు సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం సీతగుంటలో భీమలింగేశ్వర ఆలయ అర్చకులు గోత్ర నామాలతో పూజలు చేశారు. గ్రామ పెద్దలు రూడ లక్ష్మణరావు, టి.శోభన్‌బాబు, అజయ్‌కుమార్ పాల్గొన్నారు. సీతగుంట కాలనీలో వినాయక పూజలు చేశారు. సోమవారం రాత్రి పెదబయలు రెండు వీధుల్లో సాంస్కృతిక కార్యక్రమాల నడుమ వినాయక విగ్రహాలను మత్స్యగెడ్డ వంతెన సమీపంలో నిమజ్జనం చేశారు. సీకరి పంచాయతీ పన్నెడ గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని ఊరేగించి మత్స్యగెడ్డలో నిమజ్జనం చేశారు. మాజీ సర్పంచ్‌లు దడియా రాంబాబు, త్రినాథ్, విజయ, సావిత్రి, పరుశురాం, వార్డు సభ్యులు, మహిళలు, వర్తకులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: మండలంలో పద్మాపురం మేజర్ పంచాయతీ యండల్లివలస గ్రామంలో మంగళవారం వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ, ఉత్సవ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు స్థానిక సీఐ హిమగిరి స్వామివారిని దర్శించుకున్నారు. తొలుత గిరిజన సంప్రదాయ నృత్య ప్రదర్శనలతో స్వాగతం పలికారు. నాయకులు మహదేవ్, యాసీన్, ఆనంద్, సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.




గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ హిమగిరి

సెల్ఫీ కోసం వెళ్లి కాలువలో చిక్కుకుపోయి...

సీతపల్లి వాగు వద్ద సురక్షితంగా బయటపడ్డ పర్యాటకులు

రంపచోడవరం: ఐ.పోలవరం వద్ద సీతపల్లి వాగులోకి సెల్ఫీ కోసం వెళ్లిన పర్యాటకులు కాలువ మధ్యలో చిక్కుకుని సురక్షితంగా బయటపడ్డారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు భూపతిపాలెం ప్రాజెక్టు నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో సీతపల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ క్రమంలో మంగళవారం పది మంది వరకు పర్యాటకులు సెల్ఫీ తీసుకునేందుకు ఐ. పోలవరం వంతెన దిగువ బండరాళ్లపైకి వెళ్లారు. ఒక్కసారిగా నీటి ఉధృతి పెరగడంతో వారు బండరాళ్లపై ఉండిపోయారు. స్థానికుల సహకారంతో నీటి ఉధృతి తక్కువగా ఉన్న వైపు నుంచి రాళ్లు దాటుకుంటూ సురక్షితంగా బయటపడ్డారు. పర్యాటకుల పూర్తి వివరాలు తెలియరాలేదు.



సీతపల్లి వాగులో బండరాళ్ల మధ్య పర్యాటకులు

బాధితులకు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించాలి

గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్

అరకులోయ రూరల్: పెదలబుడు పంచాయతీ గంజాయిగుడ గ్రామంలో ప్రస్తుత వర్షాలకు నిరుపేద కొర్రా నాగేశ్వరరావు ఇల్లు కూలిపోయింది. గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్, నాయకులు కలిసి మంగళవారం పరిశీలించారు. బాధిత కుటుంబాలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బాలదేవ్ మాట్లాడుతూ తుఫాన్ ఎదుర్కోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందన్నారు. ఇళ్లు కూలిపోయిన బాధితులకు తక్షణమే కొత్తవి నిర్మించి ఇవ్వాలని, నష్టపరిహారం అందించాలన్నారు. నాయకులు సీతమ్మ, కుమారి, మధు, దావీదు, జానీ తదితరులు పాల్గొన్నారు.



కూలిన ఇంటిని పరిశీలిస్తున్న గిరిజన సంఘం నాయకులు

వర్షాలతో వారపు సంత వెలవెల

జి.మాడుగుల: వర్షాలు కారణంగా వ్యాపారులు, రైతులు రాకపోవటంతో జి.మాడుగుల సంతబయలు గ్రామంలో మంగళవారం వారపు సంత వెలవెలబోయింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఘాటీ రోడ్ల ప్రయాణాలను మూసివేశారు. దీంతో మైదాన ప్రాంతాల వ్యాపారులు, చిల్లర దుకాణాదారులు, గిరిజన రైతులు రాకపోవటంతో సంత బోసిపోయింది. వారపు సంతలో జీవాలు, పసుపు, పిప్పలి, అల్లం, కాఫీ, మిరియాలు వంటి వాణిజ్య పంటలు, నిత్యావసర సరకులు, దుస్తుల దుకాణాలు, చేపలు, వంటి ప్రజావసర సరకుల క్రయ విక్రయాలు రూ.2 కోట్ల వరకు జరుగుతుంటాయి. స్థానిక వ్యాపారులు, చిల్లర దుకాణదారులు కొద్ది మంది మాత్రమే రావడంతో నిత్యావసర సామగ్రి, కూరగాయలు, వంటివి కొనుగోళ్లు చేశారు.



జి.మాడుగుల సంతబయలు గ్రామంలో వెలవెలబోయిన వారపుసంత

గిన్నెలకోట, జామిగుడ గెడ్డలు దాటొద్దు

పెదబయలు: మండలంలోని గిన్నెలకోట, జామిగెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి తహసీల్దారు జి.రంగారావు తెలిపారు. గెడ్డలు, వాగులు దాటే సహసం చేయొద్దన్నారు. అత్యవసర పరిస్థితి ఉంటే రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండలంలోని 23 పంచాయతీల పరిధిలో కిముడుపల్లి చేదుపుట్టు, మరడాపల్లి, పెదకోడాపల్లి పంచాయతీ పరదానిపుట్టు, గోమంగి పంచాయతీ మర్రిపుట్టు, గోమంగి, గుల్లేలు సరిహద్దు కాజ్‌వేలపై వరదనీరు తగ్గిందన్నారు. మంగళవారం ఉదయం నుంచి వాహనాల రాకపోకలు సాగుతున్నాయన్నారు. భారీ వర్షాలకు ఎనిమిది ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని తెలిపారు. వరద తగ్గితేగాని పంట నష్టం చెప్పగలమన్నారు. ఎక్కువగా వరి పంట ముంపు జరిగిందన్నారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పంట నష్టాలపై నివేదిస్తాం

అడ్డతీగల: భారీ వర్షాలతో అడ్డతీగల సబ్ డివిజన్‌లోని నాలుగు మండలాల్లో పాడైన వివిధ పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు సహాయ వ్యవసాయ సంచాలకురాలు కంకిపాటి సావిత్రి తెలిపారు. అడ్డతీగల మండలంలో 65 ఎకరాల విస్తీర్ణంలో వరి పంట దెబ్బతిందన్నారు. వై.రామవరం మండలంలో 45 ఎకరాల్లో మొక్కజొన్న, రాజవొమ్మంగి మండలంలో 90 ఎకరాల్లో వరి పంట, అడ్డతీగల మండలంలో 20 ఎకరాల్లో పత్తి పంట దెబ్బతిందన్నారు. ఇంకా క్షుణ్ణంగా పరిశీలించి పంట నష్టం అంచనాలను రూపొందించి అధికారులకు నివేదిస్తామన్నారు.

అందరు సహకారంతోనే గంజాయి నిర్మూలన

- అరకులోయ సీఐ హిమగిరి

అరకులోయ రూరల్: అందరు సహకారంతోనే గంజాయి నిర్మూలన సాధ్యమవుతుందని సీఐ హిమగిరి తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మోటార్ యూనియన్ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి రవాణా చేస్తున్న వారితో స్నేహం చేసి వాటిపై మోజు పెంచుకోవద్దన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రైవర్లు సమజానికి ఆదర్శంగా నిలవలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు నేరుగా సమాచారం ఇచ్చి సమాజ మార్పుకు తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో మోటార్ యూనియన్ అధ్యక్షుడు రాజయ్య, మాజీ అధ్యక్షుడు ఎంటీఆర్ సాంబ, తదితరులు పాల్గొన్నారు.

కొండ వాగులు తగ్గుముఖం

వై.రామవరం: మండలంలో మంగళవారం వర్షం తగ్గుముఖం పట్టడంతో కొండ వాగుల ప్రవాహ ఉధృతి క్రమేపి శాంతిస్తోంది. దీంతో ఎంపీడీవో కె. బాపన్నదొర ఆధ్వర్యంలో అధికారులు, మండల ప్రజా ప్రతినిధులు స్పందించి జేసీబీలతో వాగు ప్రవాహంలో కొట్టుకువచ్చి వంతెనలకు అడ్డుగా పడిన చెట్లను తొలగించడంలో బిజీ అయ్యారు. బండిగడ్డ, యార్లగడ్డ, వై.రామవరం గ్రామాల సమీపంలో జేసీబీలతో తొలగించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కడబాల ఆనందరావు, ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి, నాయకులు కరణం కనకరాజు, పంచాయతీ కార్యదర్శి పుడిగి భార్గవచరణ్, వీఆర్వో లక్ష్మి పాల్గొన్నారు.



కొండవాగు వంతెనపై చెట్లను జేసీబీతో తొలగిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

బాధితులను ఆదుకోవడంలో 'కూటమి' విఫలం

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ధ్వజం

అరకులోయ రూరల్: జిల్లాలో తుపాను బీభత్సం బాధాకరమని, సకాలంలో సహాయక చర్యలు చేపట్టడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం విమర్శించారు. మంగళవారం ఆయన మాడగడలో బాధిత కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరకులు అందజేశారు. ముంపునకు గురైన ఇళ్లు, కోతకు గురైన రహదారి, డ్రైనేజీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల తప్పిదం వల్లే డ్రైనేజీ వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయన్నారు. అనంతరం మాడగడ పీహెచ్‌సీని సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. పంచాయతీ అధికారులతో ఆయన మాట్లాడారు. అక్రమ నిర్మాణాలు చేపట్టేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొత్తభల్లుగుడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల వసతి గృహాన్ని సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. వైస్ ఎంపీపీ రామన్న, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు.



బాధితులకు బియ్యం, నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

వరద బీభత్సం

- కొట్టుకుపోయిన కల్వర్టులు
- నిలిచిన రాకపోకలు



బుంగాపుట్టు పంచాయతీ గర్రం వద్ద కొట్టుకుపోయిన కల్వర్టు



ఉధృతంగా ప్రవహిస్తున్న కాలువ


ముంచంగిపుట్టు: మండలంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వరద నీరు బీభత్సం సృష్టించింది. పలు చోట్ల కల్వర్టులు, వంతెనలు కొట్టుకుపోయాయి. భారీగా వరదనీటి ప్రవాహంతో లక్ష్మీపురం పంచాయతీ ముత్తగుమ్మి కల్వర్టు కుంగిపోయింది. ఇదే మార్గంలో గర్రం కల్వర్టు కొట్టుకుపోవడంతో లక్ష్మీపురం నుంచి బుంగాపుట్టుకు పంచాయతీకి 26 గ్రామాల పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. ముత్తగుమ్మి కల్వర్టు కుంగిపోయిన విషయం తెలుసుకున్న పీఆర్ ఏఈ మురళీకృష్ణ, లక్ష్మీపురం సర్పంచ్ త్రినాథ్ పరిశీలించారు. తాత్కాలిక రాకపోకలు జరిగేలా చర్యలు తీసుకుంటామని, నూతనంగా నిర్మిస్తున్న వంతెనను 15 రోజుల్లో పూర్తి చేస్తానని ఏఈ తెలిపారు. వైస్ ఎంపీపీ సత్యనారాయణ, గిరిజన సంఘం జిల్లా నేత ఎంఎం శ్రీను కొతకు గురైన రహదారిని పరిశీలించారు. వెంటనే మరమ్మతులు చేయాలని కోరారు. జోలాపుట్టు, డుడుమ జలాశయాల గేట్లు ఎత్తి నీటి విడుదల చేయడంతో పొలాల్లోకి చేరి కొట్టుకుపోయాయి. పంట నష్టం కలిగిన రైతులను ఆదుకోవాలని వైస్ ఎంపీపీ భాగ్యవతి, సర్పంచులు మిల్కి, వసంత, దనియాలు కోరారు.

కొయ్యూరు: కొన్ని ప్రాంతాల్లో వరద తగ్గుముఖం పట్టలేదు. పలకజీడి, గొట్లుపాడు, కొయ్యూరు, కాకరపాడు, తీగలమెట్ట కాలువలు ఉధృతంగానే ప్రవహిస్తున్నాయి. యు.చీడిపాలెం పంచాయతీలో 20 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నల్లగొండ వద్ద కొట్టుకుపోయిన కాజ్‌వే పునరుద్ధరణ పనులు మంగళవారం చేపట్టారు.

వేతన బకాయిలు చెల్లించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య పడాల్

చింతపల్లి: స్థానిక ఏరియా ఆస్పత్రిలో స్వీపర్లకు, సెక్యూరిటీ గార్డులకు బాకాయి పడ్డ రెండు నెలల వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. మంగళవారం ఇక్కడ ఆస్పత్రి ఎదురుగా భోజనం విరామ సమయంలో ధర్నా చేశారు. చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ ఇచ్చేది చాలీచాలని జీతాలని, అవి కూడా నెలల తరబడి ఇవ్వకుంటే ఎలా బతుకుతారని నిలదీశారు. పాడేరు, అరకులో పనిచేస్తున్న స్వీపర్లకు, చింతపల్లి, ముంచింగిపుట్టులో స్వీపర్లకు సెక్యూరిటీ గార్డులకు ఇచ్చే వేతనంలో వ్యత్యాసం చూపుతున్నారని మండిపడ్డారు. స్వీపర్ల సంఘం సూపర్‌వైజర్ మంగవేణి, సాయిలక్ష్మి, దారమణి, సెక్యూరిటీ గార్డుల సూపర్‌వైజర్ లక్ష్మణరావు, బుజ్జిబాబు, మధు, అర్జున్ పాల్గొన్నారు.



ఆస్పత్రి ఎదురుగా ఆందోళన చేస్తున్న కార్మికులు

50 మంది రోగులకు వైద్య పరీక్షలు

హుకుంపేట: తీగలవలస పంచాయతీ గరుడాపల్లిలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 58 మంది రోగులను వైద్యాధికారి మోహన్‌రెడ్డి పరీక్షించారు. వాతావరణంలో మార్పుల వల్ల గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలుతున్న నేపథ్యంలో గిరిజనులు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోజు కాచిన నీరు తాగాలని అవగాహన చేపట్టారు. వైద్య సిబ్బంది నాగమణి, సాంబశివరావు, భవాని, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.